క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడల్లో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడల్లో ప్రతిభ కనబరచిన దివ్యాంగులకు పతకాలు అందజేస్తున్న డీఈఓ సలీంబాష

ముమ్మిడివరం: రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడల్లో కోనసీమ జిల్లా దివ్యాంగ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాష తెలిపారు. శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు యాండ్రా జాహ్నవి 50 మీటర్ల పరుగులో రజత పతకం, జానా రేఖ, చంద్రమౌళి, వెంకట్ బోసిగేమ్‌లో వెండి పతకాలు సాధించారు. గౌతమ్ 100, 200 మీటర్ల పరుగులో రజత పతకం, సాధించాడన్నారు. ఈ క్రీడలకు శిక్షణనిచ్చిన కోచ్‌లు ఎస్.హిమబిందు, ఎస్.వెంకటేశ్వరరావు, జి.సురేష్‌ను డీఈఓ బాషా అభినందించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు డి.గౌరీ శంకర్, ఆర్.ఉదయ్‌భాస్కర్, జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, పలువురు అధికారులు దివ్యాంగ చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ఉప్పలగుప్తం: అమలాపురం–చల్లపల్లి ప్రధాన రహదారిలో సరిపల్లి వద్ద సర్పంచ్ గెద్దం స్వరూపరాణి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన చవటపల్లి శ్రీనివాసరావు (బుల్లి దొర) సౌజన్యంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న 203 మంది కూలీలకు మాజీ సర్పంచ్ గెద్దం సురేష్ బాబు చల్లటి మజ్జిగ అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దేవరపల్లి తాతారావు, గెద్దం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం

ముమ్మిడివరం: పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిమండలంలోని ప్రభుత్వ పాఠశాల పరిధిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా సత్కరించారు. పదో తరగతిలో ప్రభ చూపించిన జంగం అనూష (582), వీహెచ్ఎస్ సందీప్ (578), వి.రవీంద్ర (576)ను సాధించి మండలంలో టాపర్స్‌గా నిలిచారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులను మండల విద్యాశాఖాధికారులు డి.గౌరిశంకర్, ఆర్.ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో డీఈవో దుశ్శాలవాతో సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మండలంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సత్కరిస్తున్న డీఈవో షేక్ సలీం బాషా

వేట నిషేధం.. అందని పరిహారం

- మత్స్యకారుల గోడు వినేదెవరు?
- ఆర్థిక ఇబ్బందుల్లో మత్స్యకార కుటుంబాలు
- అందని మత్స్యకార భరోసా
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వేట నిషేధంతో నిలిచిపోయిన బోట్లు

ముమ్మిడివరం: వేట సాగనిదే పూట గడవని బతుకులు వారివి. నోట్లోకి ముద్ద వెళ్లాలంటే సముద్రంలోకి వేటకు వెళ్లాల్సిందే. ప్రస్తుతం వేట నిషేధం అమలు కావడంతో మత్స్యకారులకు ఆదాయం లేక వారిని ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో 1,800 వేల కుటుంబాల వారు మత్స్య సంపదపై ఆధారపడి బతుకుతున్నారు. చేపలు వేట తప్ప వేరే పని చేతకాని మత్స్యకారులు వేట విరామ సమయం కావడంతో భారంగా కాలాన్ని వెళ్లదీస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు వలసబాట

వేట సాగక, ఆదాయం లేక ఆర్థిక ఇబ్బందులతో ఆ కుటుంబాలు కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో కొంతమంది వలస బాట పడుతుండగా మరి కొంతమంది కూలీ పనులకు వెళ్తున్నారు. ఇంకొందరు ఇంజన్ల మరమ్మతులు, వలలు అల్లికలు, వంటి పనులు చేసుకుంటున్నారు. ఆదాయం సరిపడా లేక కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తున్నారు. మరో వైపు చేపలు అమ్ముతూ జీవనం సాగించే మత్స్యకార మహిళలు సైతం ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో తంచన్‌గా మత్స్యకార భరోసా

ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15 అర్ధరాత్రి వరకు 61 రోజులు పాటు వేట నిషేధం అమలులో ఉన్నందున గంగపుత్రులు ఉపాధి కరువై దిక్కులు చూస్తున్నారు. ప్రస్తుతం వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. డీజిల్‌కు సబ్సిడీ లేదు. సంక్షేమ పథకాలు అందవు. కనీసం పౌర సరఫరాశాఖ నుంచి సరుకుల్లో కోత తదితర సమస్యలతో గంగపుత్రులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో వేట నిషేధిత సమయంలో కేవలం రూ.4వేలు మాత్రమే నిషేధిత భృతి అందించే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2019 నుంచి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసా రూ.10 వేలకు పెంచి నాలుగేళ్లు తంచన్‌గా మత్స్యకార భరోసా అందించారు. గతేడాది ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో మత్స్యకార భరోసా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి 11 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు, గతేడాదికి సంబంధించిన మత్స్యకార భరోసా కూడా ఇవ్వలేదు. ఇప్పుడు రెండో ఏట వేట నిషేధ సమయం వచ్చింది. మత్స్యకార భరోసా రూ.10 వేలు నుంచి రూ.20 వేలకు పెంచి ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈసారైనా రెండేళ్లకు కలిపి రూ.40 వేలు ఇస్తారని మత్స్యకారులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో నెట్టుకొస్తున్నాం



వేట సాగక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం. ఇంటి వద్ద తీరికగా ఉండలేక వలలు, బోట్ల మరమ్మతులు చేసుకుంటున్నాం. వేట నిషేధిత సమయంలో ఇస్తున్న భృతి అందక కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రభుత్వం స్పందించి వేట నిషేధ భృతి వెంటనే అందించాలి.

– పినపోతురాజు, మత్స్యకారుడు, మట్లపాలెం

ప్రతి కుటుంబానికి రూ.40 వేలు ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.20వేలు చొప్పున రెండేళ్లకు రూ.40వేలు మత్స్యకార భరోసా సొమ్ములు వెంటనే మత్స్యకారుల ఖాతాలకు జమ చేయాలి, ఎన్నికల సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

– రేకాడి వర్మ, జిల్లా మత్స్యకార సంఘం డైరక్టర్, ముమ్మిడివరం

డ్రెయిన్‌లో పూడిక తొలగింపు



చెత్తా చెదారంతో నిండిన మేజర్ డ్రెయిన్ (నాడు)



అమలాపురం మార్కెట్ ఏరియాలో మేజర్ డ్రెయిన్‌ను శుభ్రం చేసిన దృశ్యం (నేడు)

సాక్షి ఎఫెక్ట్

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కార్యాలయానికి అతి సమీపంలోనే మార్కెట్ ఏరియాలో ఉన్న మేజర్ డ్రెయిన్ పూడికలు, చెత్తా చెదారంతో నిండిపోయి అస్తవ్యస్తంగా మారిన దుస్థితిపై మున్సిపల్ పారిశుధ్య అధికారులు స్పందించారు. ఆ డ్రెయిన్‌ను శుభ్రం చేసి చెత్తను పూర్తిగా తొలగించి, మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకున్నారు. ఈనెల 21న సాక్షిలో 'స్వచ్ఛతపై చిత్త శుద్ధి కరువు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఈ చర్యలు చేపట్టారు.

ఓడలరేవు ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

అల్లవరం: ఓడలరేవులోని ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు ఆకెళ్ల కృష్ణ 2006–09 మధ్య బోధనా వృత్తి నిర్వర్తిస్తూనే అమలాపురంలోకి ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఎంసీఏ రెగ్యులర్ కోర్సు చేశారని అమలాపురానికి చెందిన ఆకెళ్ల సూర్య మురళీకృష్ణమూర్తి శుక్రవారం అల్లవరం విద్యా శాఖకు ఫిర్యాదు చేశారు. అంబాజీపేట మండలం నందంపూడి ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న సయయంలో ఎంసీఏ పూర్తి చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ ఏక కాలంలో ఎంసీఏ కోర్సు పూర్తిచేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆకెళ్ల కృష్ణ యూట్యూబ్ చానల్ నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ చేసి ప్రభుత్వాన్ని మోసం చేసిన ఉపాధ్యాయుడు ఆకెళ్ల కృష్ణపై చర్యలు తీసుకోవాలని మండల విద్యా శాఖను కోరారు. దీనిపై ఎంఈఓ–2 ఏడుకొండలను వివరణ కోరగా ఉపాధ్యాయుడు కృష్ణపై ఫిర్యాదు రావడం వాస్తవమేనని, దీనిపై విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని తెలిపారు.

మలేరియా నివారణకు సమష్టి కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం

అల్లవరం: మలేరియా నివారణకు సమష్టి కృషి, ప్రజల సహకారం అవసమని వైద్యులు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బెండమూర్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మలేరియాపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా అంతం మనతోనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ప్రజలందరిలో మార్పు వస్తే మలేరియా అంతం అవుతుందని తెలిపారు. డెంగీ, మలేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గాడిమొగలో అవగాహన ర్యాలీ

తాళ్లరేవు: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాడిమొగ పీహెచ్‌సీ వద్ద మలేరియా దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. వైద్యాధికారి శ్యామల ఆధ్వర్యంలో మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో ఎంపీహెచ్ఈఓ కుమార్, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అక్రమ ఆక్వా చెరువులు, విద్యుత్ కనెక్షన్లను తొలగించాలి



అక్రమ ఆక్వా చెరువులపై ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఐ. పోలవరం: ఆక్వా చెరువులకు అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించాలంటూ రైతులు మండల తహసీల్దార్ విజయశ్రీకి పశువుల్లంక సొసైటీ రైతులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పశువుల్లంక సొసైటీ ఎస్సీ రైతులు చీకురుమల్లి తాతారావు ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పశుపులంక ఎస్సీ సొసైటీలో వందలాది ఎకరాల్లో కొబ్బరి తోటలున్నాయని, వాటిలో అంతర పంటలుగా అరటి, మొక్కజొన్న, అపరాలు పండించుకుని జీవిస్తున్నామన్నారు. గ్రామంలో పెరుగు లంక భూముల్లో అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వారని, సాగు కోసం ఉప్పునీటిని తోడుతున్న కారణంగా కొబ్బరి తోటలకు పెనుముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. కొబ్బరి తోటల్లోని మంచి నీటి బోర్ల సమీపంలో 200 మీటర్ల నుంచి 300 మీటర్లలోతులో ఉప్పునీటి బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని రైతులు తెలిపారు. ఎస్సీ సొసైటీ భూముల్లోకి విద్యుత్ అధికారులు అక్రమ విద్యుత్ లైన్లు అనుమతులు ఇస్తున్నారన్నారు. ఆక్వా రొయ్యల చెరువులకు విద్యుత్ సౌకర్యం ఉండడంతో ఉప్పునీరు తోడుకుంటున్నారని దీని వల్ల మంచినీటి బోర్లు కలుషితమయ్యాయని ఆరోపించారు. వెంటనే డి పట్టా భూములను అనుకుని తవ్విన అక్రమ ఆక్వా చెరువులను, వాటికి ఇచ్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని వినతిపత్రంలో రైతులు పేర్కొన్నారు. రైతులు సమస్యల్ని ఉన్నతాధికారి దృష్టికి తీసుకుని వెళతానని విజయ శ్రీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీకురుమల్లి తాతారావుతో పాటు, ధూళిపూడి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ వద్ద రిసోర్స్ రికవరీ పార్క్ ఏర్పాటు

- పారిశుధ్య సమస్యకు పరిష్కారం
- పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తుంగన్



మాట్లాడుతున్న పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తుంగన్

యానాం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. స్థానిక గోపాల్ నగర్ సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో 15 రోజుల్లో రిసోర్స్ రికవరీ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తుంగన్ పేర్కొన్నారు. స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటుచేసేది డంపింగ్‌యార్డు కాదని రిసోర్స్ రికవరీ పార్క్ అని తెలిపారు. హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ ఆధునిక యంత్రాలతో రిసోర్స్ రికవరీ పార్క్ ఏర్పాటు చేస్తుందన్నారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించిరిసోర్స్ రికవరీ పార్క్ వద్దకు తీసుకువస్తారని, అక్కడ శాస్త్రీయ విధానాలతో సేంద్రీయ ఎరువుగా మారుస్తారన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిసోర్స్ రికవరీ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కనకాలపేట డంపింగ్‌యార్డు వద్దనున్న చెత్తను యంత్రాలతో బయోమైనింగ్‌గా మారుస్తారన్నారు. కనకాలపేటలో భారీగా పోగుపడిన చెత్తను కాంట్రాక్టు సంస్థ 6 నుంచి 8 నెలల్లో తొలగిస్తుందన్నారు.

జీజీహెచ్‌లో సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించానని, త్వరలో అక్కడ మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ అన్నారు. సబ్‌రిజిస్టర్ ఆఫీసులో లింకు ఆఫీసర్‌ను ఏర్పాటు చేసినట్లు శుక్రవారం సాయంత్రం నుంచే రిజిస్ట్రేషన్లు, పెండింగ్‌లో ఉన్నవి తదితరమైనవి పూర్తిచేసినట్లు తెలిపారు. ఆర్టీఓ నియామకంపై ఉన్నతాధికారులతో చర్చిస్తానని తెలిపారు. పూర్తిస్థాయి మున్సిపల్ కమిషనర్ నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

అమలాపురం రూరల్: రేషన్‌కార్డులో పేరు నమోదైన ప్రతి ఒక్కరినీ ఎలక్ట్రానిక్ పద్ధతిలో గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈనెల 30వ తేదీ లోపల ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ శుక్రవారం తెలిపారు. ఈకేవైసీ పూర్తిచేసుకుని నిరంతరాయంగా ప్రభుత్వ పథకాల లబ్ధిని, సంక్షేమాన్ని పొందాలన్నారు. రేషన్ షాపులు, మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ ఆపరేటర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారి కార్యాలయాల్లో ఈకేవైసీ చేయించేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలు, 80 ఏళ్లు దాటిన వారికి ఈకేవైసీ నుంచి మినహాయింపు ఉందన్నారు. అన్నీ సక్రమంగా ఉంటే సరికొత్త ఫీచర్లతో నూతన నమూనాతో ఏటీఎం తరహాలో రేషన్ కార్డును త్వరలో అందుకోవచ్చని తెలిపారు.

చెత్త తరలింపు ప్రక్రియ ప్రారంభం

యానాం: గోపాల్‌నగర్ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తున్న రిసోర్స్ రికవరీ పార్క్ వద్దకు శుక్రవారం పట్టణంలో 60 రోజులుగా పేరుకుపోయిన వందలాది టన్నుల చెత్తను తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా హెచ్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో 4 పొక్లయిన్లు, 50 ట్రాక్టర్ల సహాయంతో పట్టణ పరిధిలోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తరలిస్తుండటంతో పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పుదుచ్చేరి అసెంబ్లీ వద్ద ప్రజలతో కలిసి ప్రదర్శన చేయడం, సీఎం రంగసామిని కలిసి చెత్త సమస్య పరిష్కరించకుంటే నిరాహారదీక్ష చేస్తానని హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. కలెక్టర్ కులోత్తుంగన్ యానాం వచ్చి పరిశీలించి గోపాల్‌నగర్ వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. గోపాల్‌నగర్ వద్ద ఆందోళన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. రిసోర్స్‌పార్క్ వద్దని రెండు నెలలుగా ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

అభివృద్ధికి విఘాతంగా అధికారుల తీరు

యానాం: నియోజకవర్గ అభివృద్ధికి కొంతమంది అధికారుల తీరు విఘాతంగా మారిందని, రాజకీయ పరమైన వ్యవహారశైలితో నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఎల్జీ కె కైలాషనాథన్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాజ్‌నివాస్‌లో ఆయనను కలసి పలు అంశాలపై ఆశోక్ చర్చించారు. ఎమ్మెల్యే లాడ్స్, ఎమ్మెల్సీ, సీఎస్ఆర్, ఆదిద్రావిడ తదితర శాఖలు ద్వారా రూ.కోట్ల నిధులు మంజూరైనా పనులు కావాలనే ఆలస్యం చేస్తున్నారన్నారు. అభివృద్ధికి విఘాతంగా మారిన అధికారులను పుదుచ్చేరికి బదిలీ చేయాలని కోరడంతో ఈ సమస్యపై చర్యలు తీసుకుంటానని ఎల్జీ హామీ ఇచ్చారని అశోక్ తెలిపారు. యానాం జిప్‌మర్‌లో అవుట్ పేషెంట్ సేవలతో పాటు ఇన్‌పేషెంట్ సేవలను ప్రారంభించాలని ఎమ్మెల్యే అశోక్ కోరారు. శుక్రవారం జిప్‌మర్ డైరెక్టర్ వీర్‌సింగ్, డీడీ రంగభాష్యంను అశోక్ కలిసారు. అనంతరం వారు మాట్లాడుతూ మే 1నుంచి డయాలసిస్ సేవలు ప్రారంభిస్తామని, అనంతరం ప్రసూతి, ఆర్థో, కార్డియో సేవలు అందిస్తామని తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారు చేయండి

అమలాపురం రూరల్: ప్రతి ఇంటి నుంచి క్రమం తప్పకుండా తడి, పొడి చెత్తను సేకరిస్తూ ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల ద్వారా సంపద తయారు చేసే విధంగా గ్రామస్థాయి పంచాయతీ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి పి. బొజ్జిరాజు సూచించారు. రూరల్ మండలం సాకుర్రు చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని శుక్రవారం డీఎల్పీవో బొజ్జిరాజు తనిఖీ చేశారు. క్లాప్ మిత్రలు సేకరిస్తున్న చెత్త సేకరణపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తుల చిరంజీవి రావు, కార్యదర్శి రామ శైలజ, పంచాయతీ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కశ్మీర్ రాష్ట్రం పహల్గామ్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన దాడులను నిరసిస్తూ అమలాపురం గడియారం స్తంభం సెంటరులో జిల్లా జన విజ్ఞాన వేదిక (జేవీవీ), యూటీఎఫ్ జిల్లా శాఖ శుక్రవారం సాయంత్రం సంయుక్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని జేవీవీ నాయకులు కోరారు. ఈ ర్యాలీలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా మొహిద్దీన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీ సుబ్బారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పెంకే సత్యనారాయణ నాయకత్వం వహించారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.

మానవహారంగా ఏర్పడి నిరసన

ఉగ్రవాదులకు దాడులకు నిరసనగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యకర్తలు మానవహారంగా ఏర్పడి దాడులను ఖండించారు. దాడుల్లో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు.

ఉపాధ్యాయుల అశ్రునివాళి

ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ స్థానిక గడియారం స్తంభం సెంటరులో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యం వహించారు. ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ జిల్లా ఎస్టీయూ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారికి ఉపాధ్యాయులు అశ్రునివాళి అర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్ దాడులను ఖండించారు.

ఉగ్రవాదుల చర్యను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

తాళ్లరేవు: పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా తాళ్లరేవులో శుక్రవారం రాత్రి జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

బండారులంకలో కొవ్వొత్తుల ర్యాలీ

అమలాపురం రూరల్: ఉగ్రవాదుల దాడిని బండారులంకలో యువత ఖండించింది. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బండారులంక వీరభద్ర స్వామి గుడి సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వద్ద జాతిపిత మహాత్మగాంధీ విగ్రహం వరకూ ర్యాలీ సాగింది.

ఉగ్రదాడికి ముస్లింల నిరసన

ముమ్మిడివరం: పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా ముమ్మిడివరం నసరుల్ ముమెనీన జామెపుల్ మస్జిద్‌లో శుక్రవారం నల్ల రిబ్బన్లతో ముస్లింలు ప్రార్థనలు చేశారు. మసజిద్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఏ.గౌస్ భాషా ఆధ్వర్యంలో కశ్మీర్‌లో పలువురిని కాల్చి చంపిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులను పట్టుకుని బహిరంగంగా కాల్చి చంపాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు.



దాడులకు నిరసనగా అమలాపురంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయులు



బండారులంకలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న యువత



ముమ్మిడివరంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఉగ్రవాద దాడులు అమానవీయం



అమలాపురం కోర్టు భవనాల ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న న్యాయవాదులు

అమలాపురం టౌన్: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానవీయమని అమలాపురం బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. న్యాయవాదులు స్థానిక కోర్టుల భవనాల ఎదుట నిరసన ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. న్యాయవాదులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలను విడనాడాలని నినాదాలు చేశారు. ఇలాంటి దుశ్చర్యలు పురరావృత్తం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలని నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు వీరన సాయి, నందిక శ్రీనివాసరావు, అడపా ప్రసాద్, నందెపు చిన్న వెంకటేశ్వరరావు, బడుగు భాస్కర జోగేష్, మట్టపర్తి అచ్యుతానంద్, వై.సత్యనారాయణ, వెంపరాల భాస్కరశాస్త్రి తదితరులు ఈ నిరసన ప్రదర్శన చేపట్టారు.